సాక్షి గుంటూరు

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024




భూగర్భ జలాలపై సర్వే

దాచేపల్లి : కేసానుపల్లిలో అధికారులు భూగర్భ జలాలపై బుధవారం సర్వే నిర్వహించారు. పలు చోట్ల నీరు ఉన్నట్లు గుర్తించారు. బోర్లు వేస్తామని ఏఈ సోమయ్య చెప్పారు.



ఆలయానికి శంకుస్థాపన

క్రోసూరు: విప్పర్ల గ్రామం బీసీ కాలనీలో విఘ్నేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 516.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు కానుకగా బంగారు నెక్లెస్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు తెనాలికి చెందిన భక్తులు బుధవారం బంగారు నెక్లెస్‌ను కానుకగా సమర్పించారు. తెనాలికి చెందిన విజయలక్ష్మి, అన్నపురెడ్డి గోపాలకృష్ణారెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. సుమారు రూ. 2 లక్షల విలువ చేసే 35 గ్రాముల బంగారంతో తయారు చేయించిన రాళ్ల నెక్లెస్‌ను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబుకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అందచేయగా ఆలయ చైర్మన్ రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోండి

ఏపీ సర్కిల్ ఏడి సతీష్

నరసరావుపేట ఈస్ట్: పోస్టల్ శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాఖ ఏపీ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.సతీష్ తెలిపారు. శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో బుధవారం నరసరావుపేట పోస్టల్ డివిజన్ ఎస్పీ పి.వెంకటస్వామి అధ్యక్షతన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడి సతీష్ మాట్లాడుతూ పోస్టల్ శాఖ అందించే ఎస్‌బీ, ఆర్‌డీ, టీడీ, సుకన్య సంవృద్ధి వంటి ఖాతాల సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డెత్ క్లయిమ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.శ్రీనివాసరావు, ఎస్‌కె.ఎం.ఫాతిమ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు వాహనాలు



నరసరావుపేట: పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినాతో కలిసి కలెక్టర్ ఎల్.శివశంకర్ ఇద్దరు లబ్ధిదారులకు రూ.43 లక్షలు విలువైన రెండు వాహనాలను పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద షెడ్యూలు కులానికి చెందిన కె.మధుసూదనరావుకు రూ.22 లక్షలు, వెనుకబడిన తరగతులకు చెందిన ఎ.వినయబాబుకు రూ.21 లక్షలు విలువైన వాహనాలను అందజేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్. సంజీవరావు, అధికారులు జి.భాగ్యలత, టీవీఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మన బడి నాడు-నేడుకు రూ.17 కోట్లు

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలో మనబడి నాడు-నేడు రెండవ విడత పనులను మార్చి 31వతేదీ లోగా పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం రూ.17కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. జిల్లా పరిధిలో నాడు-నేడు పనులు జరుగుతున్న 530 పాఠశాలలకు రివాల్వింగ్ ఫండ్ కింద ఆయా పాఠశాలల ఖాతాలలో జమ చేసినట్టు వివరించారు. నిధుల వినియోగంపై ఎంఈఓలు, ఇంజినీర్లు, పాఠశాలల హెచ్ఎంలకు పలు సూచనలు చేశారు. నాడు-నేడు ఫేజ్-2 అంచనాల ప్రకారం నిధులను ఖర్చు చేసి మార్చి 31వ తేదీ లోగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. మొదటి విడతలోని గదుల నిర్మాణం పూర్తి అయిన తర్వాత మాత్రమే రెండవ విడత అదనపు గదుల నిర్మాణానికి అనుమతి తీసుకోవాలన్నారు. గతంలో ఇతర పాఠశాలల నుంచి టీఈఓ తీసుకొన్న పాఠశాలలు సదరు నగదు మొత్తాన్ని తిరిగి అదే పాఠశాలకు టీఈఓ ఇవ్వాలని తెలిపారు. సివిల్ వర్క్ పనులు పూర్తయిన స్థాయిలో ఫొటోలు తీయిస్తూ వర్క్ ప్రోగ్రెస్‌ను తెలియచేయాలని సూచించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6000, గరిష్ట ధర రూ.7400, మోడల్ ధర రూ.6800 వరకు పలికింది.

లోక్‌సభకు రోశయ్య..

అసెంబ్లీకి అంబటి మురళీకృష్ణ

- సమన్వయకర్తలుగా 8వ జాబితాలో ప్రకటించిన వైఎస్సార్ సీపీ



కిలారి వెంకట రోశయ్య



అంబటి మురళీకృష్ణ

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బుధవారం రాత్రి ప్రకటించిన ఎనిమిదో జాబితాలో గుంటూరు జిల్లాకు సంబంధించి రెండు విశేషాలు చోటు చేసుకున్నాయి. పొన్నూరు ఎమ్మెల్యేగా ఉన్న కిలారు వెంకట రోశయ్యను గుంటూరు లోక్‌సభ సమన్వయకర్తగా ప్రకటించగా, అక్కడ ఖాళీయైన పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గానికి బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణను ఎంపిక చేశారు. కిలారి రోశయ్య ప్రస్తుతం పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి రోశయ్య పార్టీలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆయనకు మంచి పట్టు ఉంది. పొన్నూరు ఎమ్మెల్యేతోపాటు, ప్రస్తుతం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. గత ఐదేళ్లుగా ఎమ్మెల్యేగా రోశయ్య అందించిన సేవలు అందిరికి తెలిసిందే.. ప్రతి గ్రామంలో పార్టీ పటిష్టతకు కృషి చేయడంతోపాటు , ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేందుకు తన వంతు కృషి చేస్తూ పార్టీకి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడంలో నిరంతరం శ్రమించారు.

పొన్నూరు నియోజకవర్గంలో విస్తృత సేవా కార్యక్రమాలతో అంబటి

సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా అంబటి మురళీకృష్ణ ఏడాది కాలంపైగా జగన్నామ సంక్షేమ సంగమం పేరిట పొన్నూరు నియోజకవర్గంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టి, తనకంటూ గుర్తింపు సంపాదించుకున్నారు. వృద్ధులు, మహిళలు, యువతకు సంబంధించి నేత్ర వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి కళ్లజోళ్ల పంపిణీ, 'మీ గుండె పదిలం' పేరిట హృద్రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, యాంజియోగ్రామ్‌లు చేయించడం, స్టంట్లు వేయించడం, గుండె శస్త్ర చికిత్సలు చేయించడం వంటి సేవా కార్యక్రమాలను ఇతోధికంగా చేపట్టారు. ఫలితంగా క్షేత్రస్థాయిలో నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలతో మమేకమవుతూ తన ఉనికిని చాటుకున్నారు. సామాన్యులకు సైతం సుపరిచితులయ్యారు. ఏడాదికిపైగా కాలంలో 61 వైద్యశిబిరాలతో, 105 కార్యక్రమాలు నిర్వహించి, వేలాదిగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. మరోవైపు దివ్యాంగ దర్శిని పేరిట కాళ్లు, చేతులు కోల్పోయిన దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు అందజేస్తూ తన సేవాని రతిని చాటుకున్నారు. వెరసి పొన్నూరు నియోజకవర్గవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు విశేష కృషి చేశారు. తన శిబిరాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలను రోగులకు అందజేయడంతో పాటు, ఇంటింటికి వెళ్లి పార్టీకి విస్తృత ప్రచారం కల్పించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రచారం చేయడంతో పాటు, ఆ పథకాల నుంచి పొందిన స్ఫూర్తితో తాను ఈ సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రతి శిబిరంలోనూ ప్రకటిస్తూ వచ్చారు. వైఎస్సార్ సీపీ పటిష్టతకు పాటుపడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఆయన చేస్తున్న సేవలకు పొన్నూరు నియోజకవర్గ ప్రజలు ఫిదా అయ్యారు. పొన్నూరు నియోజకవర్గంలో ఐదు గ్రామాలు మినహా అన్ని గ్రామాలలో ఇప్పటికే జగన్నామ సంక్షేమ సంగమం శిబిరాలను పూర్తి చేసి పేదల ఆరోగ్యానికి తన వంతు చేయూతనందించారు. అంబటి మురళీకృష్ణ స్వగ్రామం పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో పెద్దేటమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించి గ్రామంపై తనకున్న బాధ్యతను తెలియజేశారు. అలాగే ముస్లింలు, ఎస్టీలకు కమ్యూనిటీ హాళ్లను నిర్మించి వారి హృదయాలలో స్థానం సంపాదించుకున్నారు. మరోవైపు తన సామాజిక వర్గానికి చెందిన విద్యార్థుల కోసం తన ఔదార్యాన్ని చాటుకుంటూ గుంటూరులో కాపు హాస్టల్ నిర్మాణంలో భాగస్వాములయ్యారు.



సేవావజ్ర అవార్డు అందజేస్తున్న మంత్రి విడదల రజిని, చిత్రంలో ఎమ్మెల్యే మద్దాళి గిరి, మేయర్ కావటి తదితరులు

వలంటీర్ల సేవలు అమూల్యం

- సచివాలయ వ్యవస్థ ఒక అద్భుతం
- ప్రజల చెంతకే పరిపాలన
- వలంటీర్ల కృషి వల్లే ఇంటింటికి ప్రభుత్వ ఫలాలు
- జగనన్న తీసుకొచ్చిన పరిపాలనా సంస్కరణల్లో సచివాలయ వ్యవస్థ ఎంతో ప్రత్యేకం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరులో 'వలంటీర్లకు వందనం'

గుంటూరు మెడికల్: వలంటీర్ల సేవలు అమూల్యమైనవని, వాటికి వెల కట్టలేమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో బుధవారం వార్డు వలంటీర్లకు ప్రోత్సాహక పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. విశిష్ట అతిథిగా హాజరైన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి వంటి వారని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో వారి పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. వలంటీర్లు చేస్తున్న సేవలకు గుర్తింపుగానే.. ప్రభుత్వం పురస్కారాలను అందజేస్తోందన్నారు. వలంటీరు వ్యవస్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక అని చెప్పారు. అలాంటి వ్యవస్థకు మీరంతా రథసారథులు అని వెల్లడించారు. సచివాలయ, వలంటీరు వ్యవస్థ ఇప్పుడు దేశంలోనే పెద్ద చర్చనీయాంశమైందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల నుంచి అనేక అధ్యయన బృందాలు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి మన రాష్ట్రంలో ఈ వ్యవస్థ పని తీరును తెలుసుకుని, ప్రశంసించి వెళుతున్నారని పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వాములు..


రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం విషయంలో వలంటీర్ల భాగస్వామ్యం ఎంతో కీలకమైనదని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల అరాచకాన్ని ప్రజలు కళ్లారా చూశారని పేర్కొన్నారు. జన్మభూమి కమిటీల పేరెత్తాలంటేనే గతంలో ప్రజలు భయపడేవారన్నారు. వలంటీర్లు ఇప్పుడు ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు చిరునవ్వుతో ఎదురెళ్లి స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందనే ఆక్రోశంతోనే ప్రతిపక్షాలు వలంటీర్లపై దుష్ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 1597 మంది వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్నామని చెప్పారు. ఐదుగురికి సేవా వజ్ర, 18 మందికి సేవా రత్న, మిగతా 1574 మంది సేవా మిత్ర పురస్కారాలను ప్రదానం చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఏసురత్నం, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి, మేయర్ కావటి మనోహర్‌లు మాట్లాడారు. డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, కమిషనర్ కీర్తి చేకూరి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు. అనంతరం మంత్రి విడదల రజిని చేతుల మీదుగా వలంటీర్లకు పురస్కారాల ప్రదానం జరిగింది.



మోదుకూరు బ్రాంచి పోస్టాఫీసు ఎదుట బాధిత మహిళలు

పొదుపు సొమ్ము పక్కదారి

- బ్రాంచి పోస్ట్‌మాస్టర్ చేతివాటం
- ఘొల్లుమంటున్న పేద మహిళలు
- చుండూరు మండలం మోదుకూరు పోస్టాఫీసులో అక్రమాలు
- ఉడాయించిన పోస్ట్‌మాస్టర్



రూ.3.50 లక్షల డిపాజిట్‌కు తెల్లకాగితం రశీదు

మోదుకూరు(తెనాలి): అవసరానికి అక్కరకొస్తాయని పొదుపు పథకాలు, డిపాజిట్ల రూపంలో పేద, మధ్యతరగతి మహిళలు మదుపు చేసిన డబ్బుకు రెక్కలొచ్చాయి. పోస్టాఫీసులో వారి ఖాతాల్లో జమచేయాల్సిన డబ్బును బ్రాంచి పోస్టుమాస్టరే స్వాహా చేశారు. తన బండారం బయటపడే వేళకు పత్తాలేకుండా పోయాడు. దీంతో తమ కష్టార్జితాన్ని కోల్పోయామని మహిళలు ఘొల్లుమంటున్నారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం చుండూరు మండల గ్రామం మోదుకూరులో గల సబ్ పోస్టాఫీసులో జరిగిన గోల్‌మాల్ ఇది.

తెల్లకాగితంపై రశీదు..

మోదుకూరుకు చెందిన ఆళ్ల భూలక్ష్మి ఒంటరి మహిళ. ఉన్న కొద్దిపాటి పొలం జీవనోపాధికి సరిపోవటం లేదని విక్రయించింది. చేతికి రూ.3.50 లక్షలు వచ్చాయి. వీటిని పోస్టాఫీసులో డిపాజిట్ చేస్తే అవసరానికి అక్కరకొస్తాయని భావించింది. నిరక్షరాస్యురాలు కావటంతో తెలిసిన వ్యక్తిని సాయం తీసుకొని గత నెల 29వ తేదీన స్థానిక బ్రాంచి పోస్టాఫీసుకు వెళ్లింది. తన పేరిట డిపాజిట్ చేయమని బ్రాంచి పోస్టాఫీసులో అందజేశారు. ప్రింటెడ్ ఫారంలో నమోదుచేసి రశీదు ఇవ్వాల్సిన బ్రాంచి పోస్ట్‌మాస్టర్ కేదార్‌నాథ్ కేవలం తెల్లకాగితంపై సంతకం చేసి స్టాంపు వేసి ఇచ్చారు. చుండూరులోని పోస్టాఫీసు నుంచి రెండురోజుల్లో పుస్తకం వస్తుందని చెప్పటంతో వచ్చేశారు. వారం తర్వాత పోస్టాఫీసుకు వెళితే, బ్రాంచి పోస్ట్‌మాస్టర్ కనిపించలేదు. అదేమంటే రావటం లేదని చెప్పారట!

రూ.20లక్షలకు పైనే స్వాహా..

పోస్టల్‌శాఖ కొత్తగా కేవలం మహిళల కోసమే ప్రవేశపెట్టిన 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం' (ఎంఎస్ఎస్‌సీ) ఇప్పుడు ఆకర్షిస్తోంది. ఏ బ్యాంకులో లేనివిధంగా 8 శాతం వడ్డీనిచ్చే ఈ పథకంలో డిపాజిట్ చేసేందుకని పలువురు మహిళలు ఉత్సాహం చూపుతున్నారు. ఇలాంటివారిలో భర్తను కోల్పోయిన తాడివాక సీతావరలక్ష్మి ఒకరు. ఎంఎస్ఎస్‌సీలో మూడేళ్ల కాలపరిమితి డిపాజిట్ చేయాల్సిందిగా రూ.50 వేలను కేదార్‌నాథ్‌కు చెల్లించింది. కనీసం సంతకం కూడా చేయకుండా తెల్లకాగితంపై రాసిచ్చాడు. ఎస్‌బీ డిపాజిట్‌కని మరో రూ.45 వేలు ఇవ్వగా ఆ మొత్తానికి సంతకం చేసి, స్టాంపు వేసి ఇచ్చాడు. ఈమెకు సంబంధించి రూ.1.25 లక్షలకు ఆచూకీ లేదు. వీరిద్దరే కాదు.. గోగిరెడ్డి పద్మావతి, గోగిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, చల్లా బాపమ్మ, విష్ణుమొలకల దుర్గ, పొన్నపల్లి వెంకట ఆదిలక్ష్మి, ఆళ్ల నాగరత్నమ్మ, లంకా రమణమ్మలు పోస్టాఫీసులో వేసిన డబ్బులు జమకాలేదు. గ్రామంలో ఇలాంటి బాధితులు పదుల సంఖ్యలో ఉంటారని, స్వాహా చేసిన డబ్బు రూ.20 లక్షల పైగానే ఉంటుందని అంటున్నారు.

పత్తాలేని పోస్ట్‌మాస్టర్..

వివిధ పథకాల్లో ప్రజలు మదుపు చేసిన డబ్బును బ్రాంచి పోస్ట్‌మాస్టర్ కేదార్‌నాథ్ స్వాహాచేశారు. ఆళ్ల భూలక్ష్మి డిపాజిట్ చేసిన రూ.3.50 లక్షలను వేరొక మహిళ పేరిట డిపాజిట్ ఖాతాకు మళ్లించినట్టు తెలుసుకున్నారు. విచారిస్తే, ఆ మహిళకు చెందిన రూ.4 లక్షల వరకు కేదార్‌నాథ్ ఇంతకు ముందే స్వాహాచేసి, భూలక్ష్మి ఇచ్చిన డబ్బులను ఆమె పేరిట డిపాజిట్ తెరిచినట్టు చెబుతున్నారు. గత 20 రోజులుగా అతడు అదృశ్యమయ్యాడు. గ్రామంలో అద్దెకుంటున్న ఇల్లు కూడా ఖాళీచేసి వెళ్లాడని తెలిసి బాధితులు ఆందోళన చెందుతున్నారు. కేదార్‌నాథ్ స్థానంలో ఇన్‌చార్జిగా వచ్చిన ఫణి, తనకు ఏమీ తెలియదనీ, తాత్కాలికంగా తనను ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారని చెప్పారు.

రైతులకు ప్రభుత్వం అండ

- జిల్లాలో రైతు భరోసా - పీఎం కిసాన్ కింద 1,26,273 మంది రైతులకు రూ.25.53 కోట్లు జమ
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



రైతులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

నెహ్రూనగర్: అధిక పంట ఉత్పాదకత కోసం, నాణ్యమైన వ్యవసాయ వనరులను సమయానుకూలంగా కొనుగోలు చేసేందుకు, సాగుదారులకు మద్దతు ఇవ్వడమనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా పథకం అమలు చేస్తున్నారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వరుసగా ఐదో ఏడాది, ఈ ఏడాదికి మూడో విడతగా వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలను రైతన్నల ఖాతాలకు బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాలకు జమ చేసే కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని గుంటూరు కలెక్టరేట్ నుంచి రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తంతో కలిసి కలెక్టర్ వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ పథకం 2019-20 సంవత్సరం నుంచి వరుసగా ఐదు సంవత్సరాలు, ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. ఐదో సంవత్సరం మూడవ విడతగా వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ 2023-24 సంవత్సరానికి బుధవారం నిధుల విడుదల జరిగిందన్నారు. జిల్లాలో 202324 సంవత్సరంలో మూడవ విడత నిధుల విడుదల నేడు 1,26,273 మంది భూ యజమానులు, కౌలు రైతు కుటుంబాలకు రూ.25.51 కోట్ల డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. అలాగే 2023-24 సంవత్సరంలో వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్ 1,26,271 మంది రైతు కుటుంబాలకు రూ.169.89 కోట్ల నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. రబీ 2021-22, ఖరీఫ్ 2022 కాలానికి వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల కింద 22,521 మంది లబ్ధిదారులకు రూ.4.38 కోట్లు అందించడం జరిగిందన్నారు. అనంతరం వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ కింద 1,26,273 మంది రైతులకు రూ.25,53,29,000ల చెక్కును, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు రబీ 2021-22, ఖరీఫ్ 2022 కింద జిల్లాలో 22,521 మంది రైతులకు రూ.4,38,88,312 చెక్కులను అందజేశారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, పీడీ రామాంజనేయులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

నెహ్రూనగర్: జిల్లాలో పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరిలతో కలసి జగనన్న పాలవెల్లువ, పేదలందరికీ ఇళ్ల పథకం స్థలాల రిజిస్ట్రేషన్, ఇళ్ల నిర్మాణం, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లేవుట్లలో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు నిర్దేశిత స్థాయిలో ప్రతివారం స్పష్టమైన పురోగతి కనిపించేలా హౌసింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణానికి అడ్వాన్స్ కింద బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించుకొని పూర్తి చేసేలా సచివాలయ ఉద్యోగులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, ఆరోగ్య శ్రీ యాప్ డౌన్‌లోడ్, ఈకేవైసీ వెంటనే పూర్తి చేయాలన్నారు.

మెగా జాబ్‌మేళాలో 659 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైనవారితో వీఆర్ జ్యోత్స్నకుమారి, కవిత, అపర్ణ, సీతారామ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో బుధవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో భారీస్థాయిలో 659 మంది అభ్యర్థులు వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలను పొందారు.

కళాశాల విద్య కమిషనర్ డాక్టర పోలా భాస్కర్ ఆదేశాల మేరకు ఏపీఎస్ఎస్‌డీసీ, కళాశాల విద్యాశాఖ సంయుక్తంగా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు 1,063 మంది హాజరయ్యారు. అపెక్స్ సొల్యూషన్స్, ధ్రువంత్ సొల్యూషన్స్, యాక్సిస్ బ్యాంక్, అరబిందో ఫార్మా వంటి 19 సంస్థల్లో 1,500 ఖాళీలను భర్తీ చేసేందుకు ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు వివిధ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు 1,063 మంది అభ్యర్థులు హాజరు కాగా, వారిలో 659 మందిని వివిధ సంస్థలు ఎంపిక చేసుకున్నాయని చెప్పారు. మరో 124 మంది అభ్యర్థులకు మొదటి విడతలో ఇంటర్వ్యూలు పూర్తి చేసిన వివిధ సంస్థల ప్రతినిధులు రెండో విడత ఎంపిక ప్రక్రియకు ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐటీ ఓఎస్డీ డి.కవిత, సీజెప్ ప్రతినిధి రమేష్, జిల్లా ఉపాధి కల్పనాధికారి రఘు, జేకేసీ సమన్వయకర్త అపర్ణ సీతారామ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్, జేకేసీ మెంటార్లు అపర్ణ, యానిస్‌ఖాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముట్టడి కార్యక్రమానికి అనుమతి లేదు

నగరంపాలెం: కాంగ్రెస్, సీపీఐ పార్టీలు, అనుబంధ సంఘాలు శుక్రవారం తలపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక హోదా, చలో ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడి కార్యక్రమాలకు ఎలాంటి అనుమతుల్లేవని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి సబ్ డివిజన్‌లో 30 పోలీస్ చట్టం, సెక్షన్ 144 అమల్లో ఉందని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ఆసరాగా చేసుకుని, అసాంఘిక శక్తులు శాంతి భద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందని తెలిపారు. ఎవరైనా పోలీస్ ఆదేశాలను విస్మరించి ముట్టడి కార్యక్రమానికి హాజరైతే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు.

నీటి టబ్‌లో పడి చిన్నారి మృతి

పట్నంబజారు: నీటి టబ్బులో పడి 17 నెలల చిన్నారి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు వివరాల మేరకు.. ఆర్.అగ్రహారంలో నివాసం ఉండే ప్రజాపథ్ మనోహర్, గీత దంపతులకు ఇరువురు సంతానం ఉన్నారు. పెద్ద బాబు విక్రాంత్‌రుద్రాన్స్ బుధవారం ఆడుకుంటూ బాత్‌రూములోకి వెళ్లి నీటి టబ్‌లో పడ్డాడు. తిరిగి లేవలేకపోవడంతో మృతిచెందాడు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో మెరిసిన కల్పన

- ఇంటర్నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ
- గుంటూరు పట్టణ బీసీఏ విద్యార్థిని
- 'సాక్షి' వల్లనే పోటీల్లో పాల్గొనగలిగానని సంతోషం

తెనాలి: ఆసియన్ త్రోబాల్ ఫెడరేషన్, ఇంటర్నేషనల్ త్రోబాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బహ్రెయిన్‌లో జరిగిన ఇండో-గల్ఫ్ ఇంటర్నేషనల్ త్రోబాల్ పోటీల్లో భారత్ జట్టు రన్నర్‌గా నిలిచింది. అసమాన ప్రదర్శనతో ప్రతిభ చూపిన జట్టులో గుంటూరుకు చెందిన చల్లా కల్పన ఉన్నారు. ఎడారి దేశం బహ్రెయిన్‌లో ఈ నెల 23-25 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో భారత జట్టు లీగ్‌లో అన్ని దేశాలపైనా విజయం సాధించింది. నాకవుట్ పోటీల్లో ఆతిథ్య జట్టు బహ్రెయిన్‌తో తలపడి 2-1 సెట్ల విజయంతో ఫైనల్స్‌కు చేరుకుంది. అమెరికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా రెండు జట్లు చెరొక సెట్‌ను గెలుచుకున్నాయి. ఫైనల్ సెట్‌లో అమెరికా గెలుపొంది ట్రోఫీని గెలుచుకోగా, భారత్ జట్టు రన్నర్‌గా నిలిచింది. జాతీయ పోటీల్లో పలు విజయాలను సాధించిన కల్పన భారత సీనియర్ జట్టుకు తొలిసారిగా ఎంపికై, ఇండో-గల్ఫ్ చాంపియన్‌షిప్‌కు ఆడే అవకాశాన్ని అందిపుచ్చుకుంది. అంతర్జాతీయ పోటీల్లో మొదటి సారిగా ఆడినప్పటికీ తన ప్రతిభతో ఆకట్టుకుంది. విజయోత్సాహంతో బుధవారం ఇంటికి చేరుకున్న కల్పన 'సాక్షి'తో మాట్లాడారు. 'పేద కుటుంబానికి చెందిన నేను అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు విమానం టికెట్, వీసా ఫీజు, యూనిఫాం, శిక్షణ శిబిరం ఖర్చులు భరించలేక ఇబ్బంది పడ్డాను. నా గురించి గత జనవరిలో 'సాక్షి'లో ప్రచురించిన కథనంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినితో సహా పలువురు స్పందించారు. ఆర్థిక సాయం చేయటంతో దిగ్విజయంగా బహ్రెయిన్ వెళ్లాను.' అని కల్పన చెప్పారు.



చల్లా కల్పన

బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాంజియోగ్రామ్ పరీక్షలు



వైద్య పరీక్షలకు వచ్చిన పేషంట్లతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పలువురికి గుండె సంబంధిత యాంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. చేబ్రోలు మండలం వేజెండ్లలో ఈ నెల 26న బజరంగ్ ఫౌండేషన్ నిర్వహించిన జగన్నామ సంక్షేమ సంగమం శిబిరంలో హృద్రోగ పరీక్షలు నిర్వహించగా, పలువురికి యాంజియోగ్రామ్ అవసరమని వైద్యులు తేల్చారు. ఈ క్రమంలో ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసి మొదటి విడతగా 13 మంది గ్రామస్తులను విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రికి తరలించారు. అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్వహించిన యాంజియోగ్రామ్ పరీక్షలో 9 మందికి ఆరోగ్య స్థితి మెరుగ్గానే ఉండగా, ఒకరికి స్టంట్, ముగ్గురికి బైపాస్ సర్జరీ ఆవశ్యకత ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో విజయవాడ మెడ్ స్టార్ ఆసుపత్రికి చేరుకున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ యాంజియోగ్రామ్‌కు హాజరైన పేషెంట్లను పరామర్శించారు. తదుపరి శస్త్ర చికిత్స, స్టంట్‌లకు ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లంచాలకు తావు లేకుండా, వివక్షకు చోటు లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం సంక్షేమ దీప్తిని స్ఫూర్తిగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

జీనీ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: అద్దంకికి చెందిన ఉపాధ్యాయుడు రాజు రూపొందించిన డీఎస్సీ, టెట్‌కు పరీక్షలకు ఉపయోగపడే జీనీ వెబ్‌సైట్‌ను వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ డీఎస్సీ, టెట్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు జీనీ వెబ్ సైట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సైట్ రూపొందించిన రాజును అభినందించారు.

బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి

మార్టూరు: ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పిన ప్రమాదంలో ఓ వ్యక్తి ఆ స్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం మధ్యాహ్నం బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద చోటుచేసుకుంది. కొరిశపాడు మండల కేంద్రానికి చెందిన తేళ్ల శేషగిరి(42) బైక్‌పై మార్టూరు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక టోల్ ప్లాజా దాటుతున్న శేషగిరి బైకు అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని సమీపంలో ఉన్న హైవే అంబులెన్స్ సిబ్బంది మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స ప్రారంభించిన కొద్దిసేపటికి పరిస్థితి విషమించి శేషగిరి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఆదిమ తరగతులపై విస్తృత అధ్యయనం

ఏఎన్‌యూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆస్ట్రేలియా, భారత్‌లో స్థానిక, ఆదిమ తరగతులపై విస్తృత స్థాయిలో అధ్యయనాలు జరగాయని పలువురు వక్తలు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆస్ట్రేలియన్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'మార్జినాలిటి అండ్ మల్టీ కల్చరల్ లిటరరీ నేటివ్స్ ఫ్రం ఆస్ట్రేలియా అండ్ ఇండియా' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ సిదియోల్ ఫ్రాంక్ హెచ్.దీన (అమెరికా), ప్రొఫెసర్ గిలియన్ డూలే (ఆస్ట్రేలియా), భారత్‌కు చెందిన ప్రొఫెసర్ ఆర్కే. ధావన్, ప్రొఫెసర్ అంగ్షుమన్ కర్, ప్రొఫెసర్ ఆర్మ్‌స్ట్రాంగ్‌లు ప్రసంగించారు. భిన్న సంస్కృతులు, దళిత సాహిత్యం, హిజ్రాల జీవన స్థితిగతులపై పరిశోధన పత్రాలు మంచి విషయ పరిజ్ఞానం కలిగి ఉన్నాయన్నారు. ఇటువంటి అంతర్జాతీయ సదస్సుల ద్వారా సాహిత్య రచనలు వేగవంతం కావాలని, ఏఎన్‌యూలోని ఆస్ట్రేలియన్ స్టడీస్ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. భారతదేశంతో పాటు ప్రపంచ దేశాల్లో ఆస్ట్రేలియన్ స్టడీస్ అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక అసోసియేషన్ ఏర్పాటు చేసి, వాటి ద్వారా సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ సదస్సు డైరెక్టర్, ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ మూడు రోజుల ఈ గ్లోబల్ సదస్సులో ఎంతో విలువైన పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. సదస్సు విజయవంతం చేసేందుకు పరిశోధకులు శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, విభాగాధిపతి ఆచార్య జి.చెన్నారెడ్డి, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు. సదస్సులో పాల్గొన్న విదేశీ ప్రతినిధులను సన్మానించారు. పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



పరిశోధకులను సన్మానిస్తున్న ప్రొఫెసర్ జిలియన్ డూలే, వీసీ ఆచార్య పి.రాజశేఖర్

33,335 దరఖాస్తుల పరిష్కారం

రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

నెహ్రూనగర్: ఓటరు జాబితా తుది ప్రచురణ అనంతరం అందిన దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాల్సి ఉందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా తుది ప్రచురణ అనంతరం ఫారం 6, 7, 8కు సంబంధించి మొత్తం 50,776 దరఖాస్తులు అందాయని, వీటిలో 33,335 క్లెయిమ్స్ పరిష్కరించినట్లు చెప్పారు. మిగిలిన వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు, లోకేషన్ చేంజ్, 1500 ఓట్లు ఉన్న ప్రాంతంలో కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ఈఆర్వోలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో కౌంటింగ్ ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించి, ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఈఆర్వోలను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, ఆర్డీఓ శ్రీఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్రరావు, లక్ష్మీ కుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మీ, పీడీ డీఆర్‌డీఏ హరిహరనాథ్, తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు రావాలి

జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో శాస్త్రీయ అలోచనలు రావాలని గుంటూరు విద్యాశాఖాధికారిణి పి.శైలజ అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా అప్‌కాస్ట్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్ష భవన్‌లో విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్, వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈఓ శైలజ పాల్గొని, మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పరిశోధనలు ప్రోత్సహిస్తే.. సృజనాత్మక ఆలోచనలకు పదునుపెట్టి, మానవాభివృద్ధికి ఉపయోగపడతారన్నారు. ఉపాధ్యాయులందరూ విద్యార్థులను అన్ని సైన్స్ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న సైన్స్ ఉపాధ్యాయులను అభినందించారు. డీసీఈబీ కార్యదర్శి జి.లలిత ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అపార సృజనాత్మక శక్తి దాగి ఉందని, ప్రోత్సహిస్తే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. క్విజ్ పోటీల్లో నూతక్కి, కంతేరు, యనమదల జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు వరుసగా తొలిమూడు స్థానాల్లో నిలిచారు. వ్యాస రచనలో సులకపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని యామిని, మేడికొండూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎస్తేరురాణి, వెల్లలూరు జెడ్పీ హై స్కూల్ విద్యార్థిని సాయి రమ్య, చిత్రలేఖనంలో కొప్పురావూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని లావణ్య, అబ్బినేనిగుంటపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని రక్షణ, సంగంజాగర్లమూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని దేవిశ్రీ తొలిమూడు స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఈస్ట్, వెస్ట్ ఎంఈవోలు జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ, బలిరామ్ నాయక్, ఉర్దూ పాఠశాలల డీఐ షేక్ ఎండీ ఖాసిం, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు తిరుమలేష్, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ గౌసుల్ మీరా, డీఎస్ఓ రవి కుమార్, రిసోర్స్ పర్సన్లు, వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో అధికారులు

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట

జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీదేవి


గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు పెద్ద పీట వేయడం ఎంతో ముఖ్యమని జిల్లా పంచాయతీ అధికారిణి కె.శ్రీదేవి అన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు భారత నాణ్యతా ప్రమాణాల సంస్థ (బీఐఎస్) ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ పంచాయతీ నిధులతో చేపట్టే పనుల్లో నాసిరకపు మెటీరియల్‌ను నివారించేందుకు సర్పంచ్‌లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలపై అవగాహన ఇందుకు దోహద పడుతుందని చెప్పారు. బీఐఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.జమీల మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను, బీఐఎస్ కేర్ యాప్ ద్వారా వివిధ వస్తువుల నాణ్యతను పరిశీలించే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఏవో శ్రీనివాసరావు, జిల్లా శిక్షణ మేనేజర్ కె.నాగేశ్వరరావు, ఆర్‌పీలు నాగేశ్వరరావు, అనురాధ, జోసఫ్, కరీముద్దీన్ పాల్గొన్నారు.



సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎఫ్టానిక్స్‌కు సీఐఐ గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవార్డు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మంగళగిరిలోని ఎఫ్టానిక్స్ సంస్థకు సీఐఐ(కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవార్డు లభించినట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రామకృష్ణ తెలిపారు. బుధవారం నగరంలోని తమ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగిన సీఐఐ సమావేశంలో ఉత్తమ టెక్నాలజీ రూపొందిస్తున్న తమ సంస్థకు అవార్డు లభించినట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెయింటెనెన్స్ సిస్టమ్ రంగాల్లో తమ సంస్థ అత్యుత్తమ సేవలను అందించినందుకు గాను అవార్డు లభించిందన్నారు. ఐబీఎం మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ చేతుల మీదుగా తమ సంస్థ ఆర్ అండ్ డీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భవానీ శంకర్, మార్కెటింగ్ మేనేజర్ మార్కండేయ వెంకట్ అవార్డు అందుకున్నారని తెలిపారు. దేశంలోని వివిధ ఐటీలు, పరిశ్రమలకు చెందిన ప్రముఖ నిపుణులతో కూడిన స్వతంత్ర్య జ్యూరీ సంస్థ రెండు దశల్లో వందకు పైగా కంపెనీల సొల్యూషన్స్‌ను పరిశీలించి, ఎఫ్టానిక్స్ సంస్థను అవార్డుకు ఎంపిక చేసిందని తెలిపారు. ఇటీవల భద్రత, సమయ పాలన, కార్యకలాపాల ప్రణాళికలను మెరుగుపరచడానికి భారతీయ రైల్వే ఎక్కువ దృష్టి కేంద్రీకరించిందని, దీనికి గాను తమ సంస్థ రియల్ టైమ్ డేటాను విశ్లేషించి, సొల్యూషన్స్‌ను అందించినట్లు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ఎఫ్టానిక్స్ ప్రతినిధులు భవానీశంకర్, మార్కండేయ వెంకట్

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

- కలెక్టర్ ఎల్.శివశంకర్
- విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

నరసరావుపేట: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అధికారులు తప్పక పాటించాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీలు, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని కచ్చితంగా అమలు చేయాలని, గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. ఇది మనందరి బాధ్యతగా భావించాలన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఖర్చుల లెక్కింపు తదితర అంశాలపై ఎంసీసీ బృందాలు, ఏఈఆర్ఓలు, వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, పోలీసు అధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు పూర్తయిందన్నారు. నోటిఫికేషన్ జారీ నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎంసీసీ అమల్లో ఉంటుందని అన్నారు. భారత ఎన్నికల సంఘం అధీనంలో పని చేస్తున్నామన్న విషయాన్ని ప్రతి అధికారీ గుర్తెరగాలని కోరారు. ప్రతి ఎన్నికల కమిషన్ కొత్తగా విడుదల చేసిన హేండ్‌బుక్‌లో ఉన్న అంశాలపై ఎన్నికల సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వి నాయకం, ఆర్డీఓ అజయ్ కుమార్, జి.రవి పాల్గొన్నారు.



అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

దాడులు ఆపకపోతే గుణపాఠం తప్పదు

- టీడీపీ నాయకుడు బ్రహ్మారెడ్డిపై విరుచుకుపడ్డ వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు
- రోడ్డుపై బైఠాయించి నిరసన

మాచర్ల: పట్టణంలోని మైనార్టీ నాయకులతో పాటు నియోజక వర్గంలోని వైఎస్సార్‌సీపీ వర్గాలపై టీడీపీ నాయకుడు బ్రహ్మారెడ్డి అనుచరుడు వై కేశవరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం మధ్యాహ్నం వందలాది మంది ముస్లిం మైనార్టీ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వాహనాల రాకపోకలు నిలిపివేశారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు షేక్ మస్తాన్, షేక్ కరిముల్లా, గట్ల కోటిరెడ్డి, దస్తగిరి, మందా సంతోష్, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, కో ఆప్షన్ మెంబర్ షేక్ యాసిన్, బాషిత్, రాష్ట్ర డైరెక్టర్ ఉప్పలపాటి జాని, వేల్పుల గురవయ్య, మైనార్టీ నియోజక వర్గ నాయకులు అల్లావుద్దీన్, అంగార్ బాషా, భారీ స్థాయిలో ముస్లిం మహిళలు రోడ్డుపై బైఠాయించారు. టీడీపీ నాయకుడు బ్రహ్మారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మైనార్టీ నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మైనారిటీల జోలికి వస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. మైనార్టీలు అలుసుగా దొరికారా అంటూ విరుచుకుపడ్డారు. నీకు అభిమానం ఉంటే ఓట్లు సంపాదించుకో.. నీచ రాజకీయాలకు తెరదించు.. మా మధ్య వివాదం పెట్టి నీ స్వార్థం కోసం ముస్లింలను బలి చేయవద్దంటూ పలువురు మహిళలు ఆవేదనతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, మైనార్టీ నేతలు నూర్ బాషా సంఘ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు భారీ స్థాయిలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు రంగంలోకి దిగి దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పగా నిరసన విరమించారు. అప్పటికే వందలాది వాహనాలు అంబేడ్కర్ సెంటర్‌లో నిలిచిపోయాయి. నిరసన ముగిసిన అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న ముస్లిం నాయకులు

కోటప్పకొండ తిరునాళ్లను ప్రశాంతంగా ముగిద్దాం

ప్రభల నిర్వాహకుల సమావేశంలో డీఎస్పీ వర్మ

నరసరావుపేట టౌన్: ప్రభలపై అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని నరసరావుపేట డీఎస్పీ వి.ఎస్.ఎన్ వర్మ హెచ్చరించారు. బుధవారం డివిజన్‌లోని ప్రభలు, ఆర్కెస్ట్రా నిర్వాహకులతో ఆయన డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మార్చి 8న మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని కోటప్పకొండ వద్ద నిర్వహించే తిరునాళ్లకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వాహకులు నడుచుకోవాలన్నారు. కోటప్పకొండకు వచ్చే మార్గంలో హైటెన్షన్ విద్యుత్ లైన్లు ఉన్న కారణంగా ప్రభల ఎత్తు 35 అడుగులకు మించరాదన్నారు. ప్రభలపై రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, బ్యానర్లు ప్రదర్శించటం పూర్తిగా నిషేధమన్నారు. రెచ్చగొట్టే విధంగా పాటలు పాడరాదన్నారు. పోలీస్ శాఖ విధించిన నిబంధనలకు లోబడి నడుచుకోవాలని నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రభల నిర్వాహకులు తమ వంతు సహకారం అందించాలన్నారు. ప్రభల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే నిర్వాహకులను బాధ్యులను చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ జగదీష్, సీఐలు మల్లికార్జునరావు, భాస్కర్, రమేష్, కృష్ణారెడ్డి, ఎస్ఐలు రోశయ్య, సుమన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ